# కథ

-పులిపాక కనకదుర్గ

**ఎక్కడో నాసిక్ ముద్రణాలయంలో ముద్రింపబడి ప్రజల విని యోగం కోసం దేశం నలుమూలలకు తీసుకువెళ్తున్న కరెన్సీ బాక్సులు అవి.**

**అందులో ఒక వెయ్యి రూపాయల నోటుకు ముద్రణ సమయంలో కాకతాళీయంగా వైష్ణవి మాత కుంకుమ రేణువొకటి వచ్చి తాకటం వల్ల ప్రాణప్రతిష్ట జరిగింది. అంతే కాదు దాని సమక్షంలో ఉన్నంత సేపు దానితో పాటే ఉండే ఇతర ప్రాణం లేని వస్తువులు కూడా దాంతో సంభాషించగలుగుతాయి.**

## జరుగుతున్న కథ

వెయ్యి నోటు ప్ర(దు)స్థానం ముందుగా బ్యాంకుకు చేరటంతో మొదలయ్యింది.

మిగిలిన వాటి కంటే ప్రత్యేకంగా ఉన్న తనను చూసుకుని అది రెపరెపలాడుతూ మిడిసిపడిపోయింది.

''చూడు దాని పొగరు ఎలా మిడిసిపడుతోందో?'' ఐదొందల నోటు వంద నోటుతో అంది.

''ఆ ఎంత కాలం మిడిసిపడుతుందిలే, ఎప్పుడో దాన్ని రద్దు చేస్తారు. అప్పుడు దాని రోగం కుదురుతుంది'' కసిగా అంది వంద నోటు.

''మీ ఏడుపులకేంగాని చూస్తుండండి నేను ఏ మహారాజు ఇంట్లోనో రాణిలాగా దర్జాగా ఉంటాను'' తన అందానికి తనే మురిసిపోతూ అంది వెయ్యినోటు.

ముందా వెయ్యినోటు గవర్నమెంటు ఉద్యోగం చేసే గుర్నాథాన్ని చేరింది. గుర్నాథం చిరుద్యోగి. అక్కడ్నించి అది గుర్నాథం కూతుర్ని స్కూలుకి తీసుకెళ్లే ఆటోడ్రైవర్ని వరించింది. డబ్బు పెద్ద మొత్తంలో పైకం కనిపించేసరికి డ్రైవర్‌కు సారాయి మీద మనసు పోయింది. ఇంకేముంది స్నేహితుల్ని కూడా పెద్ద మనసుతో వెంట తీసుకెళ్లి సారా పోయించేడు.

ఇప్పుడు వెయ్యి నోటు కాంట్రాక్టరు సుబ్బరాజు సొంతం అయ్యింది.

సుబ్బరాజు ఎప్పుడూ ఖద్దరు బట్టలే ధరిస్తాడు. తెల్లటి ఖద్దరు జేబులోంచి ప్రపంచాన్ని గర్వంగా పరికించింది వెయ్యినోటు. సుబ్బరాజుతో పాటు అది కూడా లేటెస్టు కారు ఇన్నోవాలో ప్రయాణించింది. ఇన్నోవా ఒక స్టార్ హోటల్ ముందు ఆగింది.

రెండొందలు పెట్టి సుబ్బరాజు ఫ్లోరిస్ట్ దగ్గర బొకె కొన్నాడు.

లోపల ముందే రిజర్వు చేయబడ్డ టేబుల్ దగ్గర ఓ అందాల భరిణ సుబ్బరాజు కోసం వెయిట్ చేస్తోంది.

''మెనీ హేపీ రిటర్న్స్ ఆఫ్ ద డే'' బొకేను అందాలరాశి చేతిలో పెట్టి నడుము చుట్టూ చెయ్యి వేసి చెప్పేడు. గుడ్డిదీపాల వెలుగులో ఎవరూ దీనిని గమనించలేదు. గమనించినా పెద్దగా పట్టించుకోలేదు గానీ వెయ్యి నోటు మటుకు తెగ సిగ్గుపడిపోయింది.

ఇద్దరే ఉన్నా బిల్లు మటుకు భారీగానే అయ్యింది.

ఇప్పుడు వెయ్యి నోటుకు ఎక్కడ లేని దిగులు పట్టుకుంది. దానికి సుబ్బరాజుని వదిలి వెళ్లటం సుతరామూ ఇష్టం లేదు. బిల్లు కింద ఎక్కడ తనని ఎక్కడ ఇచ్చేస్తాడో అని దాని భయం.

వెయ్యి నోటు అదృష్టం బాగుంది.

సుబ్బరాజు క్రెడిట్ కార్డు ద్వారా బిల్లు పే చేశాడు.

వెయ్యి నోటుకు ఇప్పుడు సంబరంగా ఉంది. దానికి తన యజమానురాలు బాగా నచ్చింది.

హోటల్ నుంచి ఇన్నోవా తిన్నగా సుబ్బరాజు గెస్ట్‌హౌస్ ముందు ఆగింది. బెడ్‌రూంలో సుబ్బరాజు షర్టుని హేంగర్‌కు తగిలించటంతో వెయ్యి నోటుకు అక్కడ ఏమీ కనిపించలేదు. ఏ అర్థరాత్రో ఇన్నోవా సుబ్బరాజు ఇంటికి చేరుకుంది.

పెద్ద పెద్ద అరుపులకు వెయ్యినోటు ఉలిక్కిపడింది.

అర్థరాత్రి, అపరాత్రి అంటూ లేకుండా తిరుగుతున్నందుకు సుబ్బరాజు భార్య రంకెలు వేస్తోంది.

వెయ్యి నోటు బాగా డీలా పడిపోయింది. ఇంతవరకూ భరిణ తన యజమానురాలు అన్న సంతోషంలో ఉందది. నల్లగా, లావుగా, అందవికారంగా ఉన్న సుబ్బరాజు భార్యని చూసేసరికి దానికి ఎక్కడ లేని నీరసం వచ్చింది. పైపెచ్చు దగ్గరలోనే ఎక్కడో సుబ్బరాజు సారాబట్టీలు ఉన్నట్టున్నాయి. విపరీతమైన వాసన. ఆ వాసనకి దానికి కడుపులో తిప్పినట్టయ్యింది.

'ఈ సారా వాసన పీల్చిన దానికంటే ఆత్మహత్య నయం' తనలో తనే అనుకుంది. 'పాపం ఈ సారాయి వల్ల ఎన్ని జీవితాలు అల్లకల్లోలమయ్యేయో, ఎంతమంది ఆడపడుచులు నిత్య నరకం పడుతున్నారో' అని జాలిపడింది.

ఇప్పుడు వెయ్యినోటుకు సుబ్బరాజు ఎంత మాత్రమూ నచ్చటం లేదు. ఎప్పుడెప్పుడు అక్కడ్నించి బయటపడదామా అని దాని మనసు చంచలమయ్యింది.

దాని ముచ్చట తీర్చటానికే అన్నట్టు సుబ్బరాజు భార్యకు సుస్తీ చేసింది. గాబరా పడిపోయిన సుబ్బరాజు ఆఘమేఘాల మీద భార్యని హాస్పిటల్లో చేర్పించేడు.

అదొక కార్పొరేట్ హాస్పిటల్.

ఏసీ రూములో మంచం మీద పడుకునుంది సుబ్బరాజు భార్య. విశాలమైన సింగిల్ రూమ్ అది. టీవీ, గెస్టులకని కంఫర్టబుల్ చెయిర్స్ ఎటాచ్డ్ బాత్‌రూంలాంటి అధునాతన సౌకర్యాలతో అలరారుతోంది. సాయంత్రం నాలుగవుతుండగా డ్యాక్టర్సు రౌండ్స్‌కు వచ్చేరు.

మొత్తంమీద పది మంది దాకా ఉన్నారు డ్యాక్టర్లు.

''ఏంటమ్మా సుస్తీ?'' వాళ్లల్లో పెద్ద డ్యాక్టరు కాబోలు అడిగాడు.

''ఆకలి ఉండటం లేదు డ్యాక్టర్ గారు''

''నీ బొంద ఎప్పుడూ తినటమేగా నీకు పని. కనీసం కొంచెం గాప్ ఇస్తేనేగా ఆకలి వేసేది లేనిది తెలిసేది'' కసిగా తిట్టింది వెయ్యి నోటు.

డ్యాక్టరుగారు మటుకు లివర్ ఫంక్షనింగ్ టెస్ట్ సజెస్ట్ చేశారు.

''ఒళ్లు నొప్పులు, కొంచెంసేపు కదలకుండా కూర్చున్నా తిమ్మిర్లు ఉంటాయండీ'' ఈసారి డ్యాక్టరుగారు ఏమీ అడక్కుండానే చెప్పింది సుబ్బరాజు భార్య.

''మడిసన్నాక కూసింత కష్టం చేయాలి

తల్లి. మీ ఇంటి బొచ్చు కుక్క కూడా లేవగానే వ్యాయామం చేస్తుంది. ఎప్పుడయినా గమనించేవా?'' వెటకారంగా అంది వెయ్యి నోటు.

''కాల్ ఫర్ బ్రెయిన్ స్కానింగ్'' సి.టి.స్కానింగ్ చేయించమని చెప్పేరు డాక్టరు గారు.

ఆ తరువాత తను ఎప్పుడూ వినని కొత్త కొత్త పదాలు బోలెడన్ని వింది వెయ్యినోటు. వారం రోజులు హాస్పిటల్లో ఉండి లక్షపైన వదిలించుకున్న తరువాత గానీ సుబ్బరాజు భార్య మనసు కాస్త కుదుటపడలేదు.


రిపోర్టులు అన్నీ నార్మల్‌గానే ఉండటంతో హాస్పిటల్ నుంచి డిశ్చార్జ్ చేశారు.

ఇప్పుడు వెయ్యి నోటు సుబ్బరాజుని వదిలి డాక్టర్‌గారిని చేరుకుంది.

మొదటి రోజు దానికి బాగానే కాలక్షేపం అయ్యింది.

డాక్టర్‌గారు క్షణం కూడా తీరిక లేనంత బిజీ మనిషి.

''ఈయనకు వైద్యం బాగా తెలుసు. కానీ బిజినెస్ మాన్ అయ్యుంటే ఇంకా బాగుండేది'' ఆయనతో రోజంతా గడిపిన తరువాత అనుకుందది.




పది దాటిన తరువాత గానీ డాక్టరుగారు ఇంటికి చేరుకోలేదు. స్నానం చేసిన తరువాత భార్య సుస్మితతో కలిసి భోజనం చేశారు.

''ఏమిటోయ్ ఈ వేళ చాలా అందంగా ఉన్నావు?'' స్లీవ్‌లెస్ సీత్రూ నైటీలో బెడ్‌రూంలోకి వచ్చిన భార్యని హత్తుకుంటూ అడిగేరు.

''ఈ టైంలో మీకు నేనెప్పుడూ అందంగా కనిపిస్తాగా''

డాక్టరుగారు నవ్వేరు. ప్రేమగా సుస్మిత బుగ్గ మీద చిటికేసి బెడ్‌వైపు నడిపించుకు వెళ్లేరు.

కొన్ని క్షణాల అనంతరం ''ఏమండీ రేపు డేటేంటో గుర్తుందా'' గారంగా అడిగింది.

''రేపటి సంగతి ఇప్పుడెందుకు డార్లింగ్?''


''అంతేగానీ రేపేంటో గుర్తులేదన్నమాట'' అలక నటించింది.


కాసేపు ఏడిపించి ఆనక లాలించి చెప్పేరు డాక్టర్‌గారు ''గుర్తుంది సు, రేపు నీ బర్త్‌డే. ఈసారి నీ బర్త్‌డేకి నువ్వు ఎప్పట్నించో అడుగుతున్న రవ్వల నెక్లెస్ నీకు గిఫ్ట్. బీరువాలో డబ్బుంది తీసుకుని కొనుక్కో...''

మర్నాడు వెయ్యి నోటు సుస్మితతో కలిసి సిటీలో ఫేమస్ జ్యూయలరీ షాపుకి వెళ్లింది. సుస్మితను చూడగానే షాపు ఓనరు సాదరంగా ఆహ్వానించేడు. సుస్మిత కొనదలచుకున్న అయిటమ్ తెలిసిన తరువాత కూల్‌డ్రింక్ ఆఫర్ చేశాడు.

సుస్మిత రకరకాల నెక్లెస్‌లు, హారాలు చాలాసేపు పరిశీలించి అందులోంచి తనకు కావల్సింది సెలెక్ట్ చేసుకుంది.

వెయ్యి నోటు ఆనందానికి అవధులు లేవు. దానికి జ్యూయలరీ షాపు తెగ నచ్చేసింది.




పైగా దానికి అప్పుడే ఓ బంగారపు గొలుసుతో స్నేహం కూడా ఏర్పడింది.

జ్యూయలరీ షాపంతా రకరకాల రాళ్ల నెక్లెస్‌లు, రవ్వల హారాలు, కెంపులు, పచ్చలు, ముత్యాల సెట్లతో, అచ్చమైన బంగారు నగలతో ధగధగలాడుతోంది.

''చూడు ఇప్పుడేం జరుగుతుందో'' గొలుసు గుసగుసగా అంది.

అధునాతనంగా ఉన్న ఇద్దరు స్త్రీలు లోపలకి వచ్చేరు. యథాప్రకారం ఓనరు మర్యాదగా ఆహ్వానించేడు.

ఇద్దరూ చాలా నగలు పరిశీలించిన మీదట ఓ బంగారు గొలుసుని సెలెక్ట్ చేసేరు. ''మార్కెట్ రేటు ఎంతుందండి?'' ఇద్దరిలో ఒకావిడ ప్రశ్నించింది.

''పది గ్రాములు తొమ్మిది వేలు''

''అదేమిటి టీవీల్లో, పేపర్లో ఎనిమిది వేల ఆరొందలే అనుంది''

''అది పొద్దుటి రేటు మేడం''

''మొత్తం ముప్పై గ్రాముల గొలుసు ముప్పై వేలు'' లెక్కలు వేసి చెప్పేడు షాపతను.

''అదేమిటి ముప్పై గ్రాములు ముప్పై వేలు ఎలా అవుతుంది?''

''మావన్నీ కరెక్టు లెక్కలు మేడం. ముప్పై గ్రాముల బంగారానికి గానూ ఇరవై ఏడు వేలు, తరుగు మూడు గ్రాములు ఇరవై ఏడు వందలు. అందులోంచి రాగి తాలూకు ఏడు వందలు తీసేసి మేకింగ్ చార్జెస్ కలిపితే ముప్పై వేలు''

వెయ్యి నోటుకు సైగ చేసి ''తరుగు మూడు గ్రాములు అన్నారు కానీ నిజానికి ఒక గ్రామే. అలాగే రాగి కూడా వాళ్లు చెప్పినదానికంటే ఎక్కువే కలిపారు'' అక్కసుగా అంది గొలుసు.

''అవునా?'' గుండెల మీద చెయ్యి వేసుకుంది వెయ్యినోటు.

''అప్పుడే ఏమయ్యింది? ఇప్పుడు చూడు'' లోనికి వస్తున్న ఓ మధ్యతరగతి స్త్రీని చూపిస్తూ అంది గొలుసు.

పాపం ఏ అవసరం వచ్చిందో తన దగ్గరున్న ముప్పై గ్రాముల గొలుసు అమ్మటానికి వచ్చింది.

''పద్దెనిమిది వేలొస్తుంది'' నిర్లక్ష్యంగా చెప్పేడు ఓనరు.

''అదేమిటండి అంత తక్కువ చెప్తున్నారు'' తెల్లబోతూ అందామె.

''అవునమ్మా బంగారం పది గ్రాములు ఎనిమిది వేలు. అందులోంచి తరుగు అయిదు గ్రాములు, అతుకులు తీసేస్తే అంతే వస్తుంది'' అదే నిర్లక్ష్యపు ధోరణిలో చెప్పేడు.

''ఎంత అన్యాయం ఇందాకటి గొలుసు అమ్మినందుకు ముప్పై వేలు. అంతే గొలుసు కొన్నందుకు పద్దెనిమిది వేలా?'' కళ్లు తేలేసింది వెయ్యి నోటు.

''అవును మరి వీళ్లు అమ్మిన గొలుసు స్వచ్ఛమైంది. మరి కొన్నది అలా కాదు కదా'' అమాయకంగా అంది షోకేసులో ఉన్న ముత్యాల హారం.

## నాన్‌వెజ్ మానేసిన స్నేహ

**ఇటీవల కాలంలో తెలుగులో టాప్ హీరోలతో నటిస్తున్న స్నేహ కాస్తంత ఒళ్లు చేసిందనే సంగతి కనిపిస్తూనే వుంది కదా! ఆ సంగతి ఆమె కూడా గ్రహించినట్టుంది. వెంటనే తగిన జాగ్రత్తలు తీసుకోవడం మొదలెట్టింది. డైటింగ్, యోగా గట్రాలు చేస్తూ దాదాపు ఆరు కిలోల వరకూ బరువు తగ్గిందిట. ముఖ్యంగా స్నేహకి ఎంతో ఇష్టమైన నాన్‌వెజ్ డిషెస్‌ని పూర్తిగా తినడం మానేసిందట. అవును మరి, గ్లామర్ కంటే అవి ముఖ్యమా ఏంటి?**



వెయ్యి నోటు, బంగారపు గొలుసు ఒకళ్ల మొహం ఒకళ్లు చూసుకున్నాయి.

వెయ్యి నోటు అలా ధనవంతుల మధ్యనే తిరుగుతూ ఒక బడాబాబుని చేరింది. దానికి తన పయనంలో చినచేపను పెదచేప, పెదచేపని తిమింగలం మింగిన కథను చాలాసార్లు మననం చేసుకుంది.

బడాబాబు దగ్గర ఇంకా చాలా నోట్లున్నాయి.

''ఏమిటి మీరంతా ఇలా ఉన్నారు?'' మురికిగా ఉన్న మిగిలిన నోట్లను ఉద్దేశించి అందది.

''మా సంగతి సరే ముందు నిన్ను నువ్వు చూసుకో'' హేళనగా అన్నాయి మిగిలినవి.

తనని తాను చూసుకున్న వెయ్యి నోటు ఒక్కసారి కెవ్వుమంది.

తనిప్పుడు నల్లగా నలిగిపోయి ఉంది.

☆